జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/





## మహారాష్ట్ర ఒప్పుకుంటే గ్రావిటీతో
# ఎల్లంపల్లికి ప్రాణహిత

- తుమ్మిడిహెట్టి కోసం.. మళ్లీ సంప్రదింపులు
- అపాయింట్‌మెంట్ కోసం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు లేఖ
- వారంలో మహారాష్ట్రకు వెళ్లనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్
- **150 మీ. ఎత్తులో బరాజ్ నిర్మాణానికి సమ్మతి కోసం ప్రయత్నాలు**

హైదరాబాద్: మహారాష్ట్ర--తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై 150 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వేగిరం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. 150 మీటర్లకు ఎత్తును పెంచి తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించుకోవడానికి మహారాష్ట్ర అంగీకారం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంతో తక్షణమే సంప్రదింపులను ప్రారంభించాలని నిర్ణయించింది.





## విశాఖ రైల్వే జోన్‌పై
# కేంద్రం గెజిట్..

- చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై గెజిట్ విడుదల
- ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి
- **2026 జూన్ 1 నుంచి అధికారికంగా జోన్ కార్యకలాపాలు ప్రారంభం**
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ఆశాభావం

ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన విశాఖపట్నం రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంపై



# రేపు విజయ్ ప్రమాణం?..

- తమిళనాట మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో నిలిచిన టీవీకే
- కాంగ్రెస్, వామపక్షాలు సహా పలు పార్టీలతో మద్దతుపై చర్చలు

**చెన్నై, మే 5: తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్‌కు చెందిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటుపై దృష్టి సారించింది. 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో టీవీకే 108 సీట్లు సాధించి అతి పెద్ద పార్టీగా నిలిచి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 118 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో నిలిచిపోయింది.**



# విజయ్ పొత్తు ఎవరితో?

- మెజారిటీ మార్క్‌కు అడుగుదూరంలో ఆగిన హీరో
- ఆసక్తి కనబరుస్తున్న కాంగ్రెస్ !
- ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌కు టీవీకే లేఖ
- అసెంబ్లీ బలనిరూపణకు 2 వారాల గడువు కోరిన పార్టీ
- కొత్త ఎమ్మెల్యేలతో సమావేశమైన విజయ్

లో



# సీఎంగా రాజీనామా చేయను

- ఓట్ల లెక్కింపులో భారీగా అక్రమాలు జరిగాయి
- దాదాపు 100 సీట్లలో ప్రజాతీర్పును దోచుకున్నారు
- ఎన్నికల సంఘం పక్షపాతంతో వ్యవహరించింది
- తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటన

కోల్‌కతా: సీఎం పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. 'నేను ఓడిపోలేదు. ఇది మమ్మల్ని ఓడించే ప్రయత్నం.


## సుప్రీంకోర్టులో పెరగనున్న
# జడ్జీల సంఖ్య..

- సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్యను పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ప్రధాన న్యాయమూర్తి మినహా జడ్జీల సంఖ్య **33** నుంచి **37**కు పెంపు
- ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం
- కేసుల భారం తగ్గించి సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని వెల్లడి
- పార్లమెంటులో సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసుల భారాన్ని తగ్గించి, సత్వర న్యాయం అందించే లక్ష్యంతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) మినహా మిగతా జడ్జీల సంఖ్యను 33 నుంచి 37కు పెంచనుంది. ఈ మేరకు



లో



# ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి దుర్మరణం

సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి దుర్మరణం చెందారు. ఆయన దాదాపు 90కి పైగా సినిమాలు నిర్మించారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్ అనే బ్యానర్ స్థాపించిన ఆయన పలు భాషల్లో సినిమాలు నిర్మించి అగ్ర నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో రాజా, సూర్యవంశం , సుస్వాగతం, నువ్వు వస్తావని, సంక్రాంతి, నవవసంతం లాంటి సూపర్ హిట్ చిత్రాలు నిర్మించారు. అంతేకాకుండా తెలుగులో నిన్నే ప్రేమిస్తా, గోరింటాకు, అన్నవరం, గాడ్ ఫాదర్ లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు నిర్మించారు. తమిళ హీరో విజయ్‌తో

లో

# డేటా సెంటర్లను మేమే నడిపిస్తాం: మంత్రి నారా లోకేష్

- ఏపీని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి లోకేష్
- శ్రీసిటీలో క్యారియర్ సంస్థ చిల్లర్ తయారీ ప్లాంట్‌కు బుధవారం శంకుస్థాపన
- డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాక, వాటిని నడిపించే శక్తిగా ఏపీ మారుతుందని స్పష్టం
- గూగుల్, రిలయన్స్ వంటి సంస్థల భారీ పెట్టుబడులతో ఏపీ దూసుకెళ్తోందని వెల్లడి
- దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న లోకేష్



నెక్స్ట్ జనరేషన్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.

లో

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ విచారణ..

అంతర్రాష్ట్ర అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు మొగ్గు చూపిన ప్రభుత్వం

తెలంగాణ గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో గట్టి షాక్ తగిలింది. ఆ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ), విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని విచారణ కమిషన్ ఈ అంశంపై సమర్పించిన 114 పేజీల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి (4ఇ270 మెగావాట్లు), యాదాద్రి (5ఇ800 మెగావాట్లు) థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవినీతి, ప్రజాధనం దుర్వినియోగం జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదికపై అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకున్న తర్వాతే కేబినెట్ ఈ నిర్ణయానికి వచ్చింది. ఈ ఒప్పందాలలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య అంతర్రాష్ట్ర అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రమేయం కూడా ఉన్నందున, సీబీఐ విచారణే సరైనదని కేబినెట్ అభిప్రాయపడింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల తర్వాత రేవంత్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరిన రెండో ప్రధాన అంశం ఇదే కావడంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ కేసును త్వరగా సీబీఐకి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# విజయ్ పొత్తు ఎవరితో?

(మొదటి పేజీ తరువాయి)

చెన్నై: ద్రవిడ రాజకీయాలను మట్టికరిపిస్తూ జనం మద్దతుతో ప్రభంజనంలా దూసుకొచ్చిన యువనేత, టీవీకే చీఫ్ విజయ్ తమిళనాట నూతన ప్రభుత్వ ఏర్పాటుకు అడుగుదూరంలో ఆగిపోయారు. మరో పది మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరంచేశారు. భావసారూప్య పార్టీలతో పొత్తుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్‌చేసి ప్రత్యేకంగా విజయ్‌ను అభినందించిన నేపథ్యంలో పొత్తుకు కాంగ్రెస్ ఆసక్తి కనబరుస్తోందనే ఊహాగానాలు ఎక్కువయ్యాయి. వీటిని టీవీకే పార్టీ కొట్టిపారేయలేదు. దీంతో విజయ్ ఏ పార్టీతో పొత్తుకు సిద్ధమవుతున్నారనే ఉత్కంఠ మరింత ఎక్కువైంది. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఏర్పాటు కోసం తమను ఆహ్వానించాలని గవర్నర్‌కు టీవీకే పార్టీ అధికారికంగా ఈ--మెయిల్‌లో లేఖ పంపింది. తమకు ఇప్పటికే 108 మంది ఎమ్మెల్యేల మద్దతుందని, రెండు వారాల గడువు ఇస్తే ఆలోపు మరో 12 మంది బయటి ఎమ్మెల్యేల మద్దతుతో శాసనసభలో బలనిరూపణకు సిద్ధమని ఆ లేఖలో పార్టీ పేర్కొంది. లేఖపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. టీవీకే పార్టీకి గవర్నర్ రెండు ఆప్షన్లు ఇచ్చే వీలుంది. అసెంబ్లీ బలనిరూపణ చేసుకోవాలని టీవీకే చీఫ్‌కు గవర్నర్ సమన్లు జారీచేయొచ్చు లేదా భాగస్వామ్య పార్టీల తనకుందని నిరూపించుకుంటూ అధికారిక లేఖను సమర్పించాలని కోరవచ్చు. 118 సీట్లకంటే అధిక మెజారిటీ తనకుందని విజయ్ నిరూపించునే పక్షంలో ప్రభుత్వ ఏర్పాటుకు తక్షణం విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించే ఆస్కారముంది. "బయటి ఎమ్మెల్యేల మద్దతుతో విజయ్ మైనార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలే మెండుగా ఉన్నాయి. మరో 6 నెలల తర్వాత కూడా విజయ్ తన బలాన్ని నిరూపించుకోవాల్సిరావొచ్చు"అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. విజయ్ రెండు చోట్ల పోటీచేసిన కారణంగా ఒక స్థానంలో రాజీనామాచేయాల్సిందే. దాంతో ఇప్పుడున్న టీవీకే ఎమ్మెల్యేల సంఖ్య 108 నుంచి 107కు తగ్గుతుంది. టీవీకే పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గంసుగమం అయితే ఈ 107లోనే ఒకరు అసెంబ్లీ స్పీకర్ అవుతారు. అప్పుడు ఆయన బలనిరూపణ వేళ ఓటు వేయడం కుదరదు. దీంతో టీవీకే బలం 106కు తగ్గుతుంది. దీంతో బలనిరూపణ వేళ సాధారణ మెజారిటీ కోసం టీవీకేకు కనీసం మరో 12 మంది సభ్యుల మద్దతు అవసరం. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం(ఏఎంఎంకే), దేశీయ మూర్పొక్కు ద్రవిడ కళగం, బీజేపీ తలో స్థానంలో గెలిచాయి. సీపీఐ(ఎం), విదుథలై చిరుతైగల్ కట్చి, సీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీలు తలో రెండు చోట్ల గెలిచాయి. పట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే) నాలుగు చోట్ల, కాంగ్రెస్ ఐదు చోట్ల గెలిచింది. ఈ తొమ్మిది పార్టీల్లో కొన్నింటితో కచ్చితంగా పొత్తు పెట్టుకుని అదనంగా 12 మంది సభ్యుల మద్దతును విజయ్ సాధించాల్సిందే. నేడు గవర్నర్ అర్లేకర్‌ను కలిసి తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని టీవీకే చీఫ్ కోరనున్నారని తెలుస్తోంది. మద్దతుగా తన కొత్త ఎమ్మెల్యేలను వెంట తీసుకెళ్లనున్నారని సమాచారం. గవర్నర్ అపాయింట్‌మెంట్ ఖరారు విషయంపై ఇంకా స్పష్టతరాలేదు. మరోవైపు పనయూర్‌లోని విజయ్ ఇంటి వద్ద తమిళపోలీసులు భద్రతను పెంచారు. తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్‌లలో విజయ్ పోటీచేసి రెండుచోట్ల నెగ్గారు. అయితే తిరుచిరాపల్లి ఈస్ట్‌స్థానంలో విజయ్ రాజీనామా సమర్పించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని పెరంబర్ నుంచే విజయ్ ఎమ్మెల్యే కొనసాగే ఛాన్సుంది. విజయ్ మంగళవారం కొత్తగా ఎన్నికైన తమ పార్టీ ఎమ్మెల్యేలతో పార్టీ కార్యాలయంలో సమావేశమై పార్టీ తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా విజయ్‌ను టీవీకే శాసనసభాపక్షనేతగా ఎన్నుకున్నారు. తర్వాత పార్టీ సైద్ధాంతిక నేతలకు విజయ్ నివాళులర్పించారు. పెరియార్ ఈవీ రామస్వామి, బీఆర్ అంబేద్కర్, కె.కామరాజ్, వేలు నచియార్, అంజలాయ్ అమ్మాళ్‌లకు విజయ్ నివాళులర్పించారు.

## రేపు విజయ్ ప్రమాణం?..

అయితే ఆయనకు మద్దతు ఇవ్వడానికి పలు పార్టీలు ముందుకు వస్తుండటంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుతో విజయ్ ఈ నెల 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయవచ్చునని, ఆయనతో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని తన నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో విజయ్ మంగళవారం సమావేశమయ్యారు. అధికార ఏర్పాటుకు ఏయే పార్టీలతో పొత్తు పెట్టుకోవాలనే విషయంపై సమావేశంలో చర్చించారు. ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు చిన్న పార్టీలు ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటిస్తున్నాయి. ఆ పార్టీ వర్గాలు వెల్లడించిన ప్రకారం ఇప్పటికే కాంగ్రెస్, వామపక్షాలతో పాటు వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) వంటి చిన్న పార్టీలతో విజయ్ మంతనాలు జరిపినట్టు సమాచారం. వీరి మద్దతు లభిస్తే విజయ్ సులభంగా ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

**రెండు వారాల గడువివ్వండి**

అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన తమను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాలని, అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకునేందుకు రెండు వారాల గడువు ఇవ్వాలని విజయ్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు మెయిల్ చేశారు. కాగా, విజయ్‌ను ఆహ్వానించడంపై గవర్నర్ న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నారు. విజయ్‌కు ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత బలం లేకపోయినా బలపరీక్షలో ఆయనను ఓడించే సాహసాన్ని డీఎంకే, ఏఐఏడీఎంకే చేయవని, బహుశా వారు ఓటింగ్‌కు గైర్హాజరయ్యే వ్యూహాన్ని అనుసరించవచ్చునని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు సుమంత్ రామన్ వ్యాఖ్యానించారు.

# సీఎంగా రాజీనామా చేయను

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా ఎలక్షన్ కమిషన్ ద్వారా వాళ్లు మమ్మల్ని ఓడించారు. కానీ నైతికంగా మేమే గెలిచినం. నేను గల్లీల్లో ఉన్న. ఇక మీద కూడా గల్లీల్లో ఉంటా. బీజేపీ అరాచకాలను ఎంతమాత్రం సహించను' అని పేర్కొన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్తారా అని అడిగిన ప్రశ్నకు మమత ఘాటుగా స్పందించారు. తాను పదవి నుంచి తప్పుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాజ్‌భవన్‌కు వెళ్లడానికి మేము ఓడిపోలేదు కదా.. ఒకవేళ ఓడిపోయి ఉంటే అప్పుడు నా రాజీనామా సమర్పించేదాన్ని. కానీ ఇప్పుడు ఆ ప్రశ్నే తలెత్తదు అని అన్నారు. బలవంతంగా నాతో రాజీనామా చేయించవచ్చని ఎవరైనా అనుకుంటే అది అసాధ్యమని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణను అందరం కలిసి నిర్ణయిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని మమత ఆరోపించారు. దాదాపు 100 సీట్లలో ప్రజాతీర్పును దోచుకున్నారని, తన పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీయడానికి లెక్కింపును ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా చేశారన్నారు. చరిత్రలో ఇదో చీకటి అధ్యాయం అని అన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాల గురించి చెబుతూ 'వారు 90 లక్షల పేర్లను తొలగించారు. మేం కోర్టుకు వెళితే 32 లక్షల పేర్లను పునరుద్ధరించారు. తర్వాత కూడా మరో 7 లక్షల పేర్లను చేర్చారు. ఎలా చేర్చారో ఎవరికీ తెలియదు. నా జీవితంలో ఇలాంటి ఎన్నికలను నేను ఎప్పుడూ చూడలేదు.' అని ఆవేదన వ్యక్తం చేశారు.

**నాపై దాడి చేశారు**

లెక్కింపు కేంద్రంలో తనపై భౌతిక దాడి జరిగిందని మమత ఆరోపించారు. తనను స్వేచ్ఛగా తిరగనివ్వలేదన్నారు. తన కడుపులో, వెనక భాగంలో తన్నారని, తనను లెక్కింపు కేంద్రం నుంచి గెంటివేశారని చెప్పారు. మేం ఎవరికి ఫిర్యాదు చేయాలి? అందరూ అమ్ముడు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత హింస జరిగిన ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేయడానికి 10 మందితో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని వేయనున్నట్లు టీఎంసీ చీఫ్ ప్రకటించారు. సోనియా , రాహుల్, అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్, హిమంత్ సోరేన్, తేజస్వి యాదవ్ తదితర నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారన్నారు. ఇకపై ఇండియా కూటమిని బలోపేతం చేయడంపై దృష్టి పెడతానని చెప్పారు

బెంగాల్ ప్రభుత్వ పదవీ కాలం మే 6తో ముగియనుంది. అయితే మమత రాజీనామాకు నిరాకరించడంతో తర్వాత ఏం జరుగుతుందనే చర్చ సర్వత్రా మొదలైంది. మమత పదవిలో కొనసాగడానికి అనుమతించే అంశాలేవీ లేవని రాజ్యాంగ నిపుణులు, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచార్య పేర్కొన్నారు. ఆమె రాజీనామా చేయకపోయినా సరే, అది పెద్ద విషయమేమీ కాదన్నారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసేవరకు పదవిలో కొనసాగమని సాధారణంగా గవర్నర్ కోరుతుంటారని చెప్పారు.

## విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్..


ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన చారిత్రాత్మక క్షణమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం శుభపరిణామమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్పులతో ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన విశాఖ, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి ఈ జోన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

## డేటా సెంటర్లను మేమే నడిపిస్తాం: మంత్రి నారా లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

కేవలం డేటా సెంటర్లకు ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, వాటిని నడిపించే కీలక భాగాల తయారీ కేంద్రంగా ఏపీని మార్చడమే తమ లక్ష్యమని ఆయన మంగళవారం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్న చిల్లర్ తయారీ యూనిట్‌కు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. "డేటా సెంటర్లకు కేవలం ఆతిథ్యం ఇవ్వడంతోనే ఏపీ సరిపెట్టుకోదు. వాటిని నడిపించే ఇంజిన్‌గా మారాలని మేము నిశ్చయించుకున్నాం. శ్రీసిటీలో క్యారియర్ ప్లాంట్ ఏర్పాటు మా ప్రయాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టం" అని లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసిటీ వంటి ప్రపంచ స్థాయి పారిశ్రామిక ప్రాంతాలు, బలమైన విధానాల మద్దతుతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే డేటా సెంటర్ల ఏర్పాటులో దేశంలోనే కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు శంకుస్థాపన జరిగింది. దీనికి తోడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడుల పైప్‌లైన్‌తో రాష్ట్రం ముందుకు సాగుతోంది. డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల నుంచి వాటికి అవసరమైన కూలింగ్ సిస్టమ్స్, పవర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, ఎలక్ట్రానిక్స్ వంటి భాగాల తయారీ వరకు పూర్తిస్థాయి వ్యవస్థను రాష్ట్రంలో నిర్మించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

## ప్రముఖ నిర్మాత ఆర్బీ చౌదరి దుర్మరణం



(మొదటి పేజీ తరువాయి)

పలు సూపర్ హిట్ సినిమాలను నిర్మించారు. విజయ్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. తెలుగులో చివరిసారిగా చిరంజీవితో గాడ్ ఫాదర్ సినిమాని నిర్మించారు.

**అర్‌బీ చౌదరి సినీ ప్రస్థానం..**

ఆయన పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. మొదట మలయాళం సినిమాలతో నిర్మాతగా ప్రవేశం చేశారు. 1989లో తమిళ సినిమాల్లో ప్రవేశించి, "సూపర్" బ్యానర్ కింద సినిమాలు నిర్మించారు. అటు తరువాత "గుడ్ నైట్" బ్రాండ్ నుండి "గుడ్" అనే పదాన్ని తీసుకుని, "సూపర్ గుడ్ ఫిల్మ్స్" అనే పేరుతో స్వతంత్రంగా నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఆయన జన్మించింది తమిళనాడులోని చెన్నై. ఆయనకు నలుగురు కుమారులున్నారు. జీవన్(స్టీల్ కంపెనీ యజమాని), జితన్ రమేష్ (నటుడు, నిర్మాత),సురేష్(నిర్మాత), జీవా(ప్రముఖ నటుడు). సూపర్ గుడ్ ఫిల్మ్స్ దక్షిణ భారతదేశంలో అత్యంత విజయవంతమైన నిర్మాణ సంస్థల్లో ఒకటి. ఆయన కుమారులు, ముఖ్యంగా జీవా మరియు జితన్ రమేష్, సినీ పరిశ్రమలో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన నిర్మించిన సినిమాలు కుటుంబ విలువలు, భావోద్వేగాలు, సామాజిక అంశాలను ప్రతిబింబిస్తూ, ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి.

## సుప్రీంకోర్టులో పెరగనున్న జడ్జీల సంఖ్య..

మినహా మిగతా జడ్జీల సంఖ్యను 33 నుంచి 37కు పెంచనుంది. ఈ మేరకు "సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు, 2026"కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. న్యాయమూర్తుల సంఖ్య పెంపు ద్వారా సుప్రీంకోర్టు పనితీరు మెరుగుపడుతుందని, పెండింగ్ కేసుల విచారణ వేగవంతమవుతుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. దీనివల్ల కక్షిదారులకు సకాలంలో న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. పెంచిన జడ్జీల జీతభత్యాలు, సిబ్బంది ఖర్చులు, ఇతర మౌలిక సదుపాయాల వ్యయాన్ని భారత సంఘటిత నిధి నుంచి భరించనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించే అధికారం ఉంది. ఈ నేపథ్యంలో 1956 నాటి చట్టాన్ని సవరించడం ద్వారా ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. గతంలో కూడా పలుమార్లు జడ్జీల సంఖ్యను పెంచారు. చివరిసారిగా 2019లో జడ్జీల సంఖ్యను 30 నుంచి 33కి పెంచారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనుంది.

# మహారాష్ట్ర ఒప్పుకుంటే గ్రావిటీతో ఎల్లంపల్లికి ప్రాణహిత

సంప్రదింపులను ప్రారంభించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వారం రోజుల్లో మహారాష్ట్రకు వెళ్లి ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమై చర్చలు జరపనున్నారు. ఇందుకోసం ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా లేఖ రాసింది. 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మిస్తే లిఫ్టు అవసరం లేకుండానే గ్రావిటీ కాల్వ ద్వారా గోదావరి జలాలను ఎల్లంపల్లి ప్రాజెక్టుకి తరలించవచ్చు. దీంతో ప్రాజెక్టు వ్యయం సైతం భారీగా తగ్గనుంది. ఫడ్నవీస్ మహారాష్ట్రలో విపక్షనేతగా ఉన్నప్పుడు తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బరాజ్ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురికానున్న రైతుల ఆందోళనలకు సైతం ఆయన మద్దతు తెలిపారు. ఆ తర్వాత ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎం అయ్యాక ఆయనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. 2016 మార్చి 8న నాటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మహారాష్ట్రకు వెళ్లి 148 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి ఫడ్నవీస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించి 165 టీఎంసీల జలాలను తరలించడానికి 2015 ఫిబ్రవరి 13న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)తోపాటు పలు అనుమతులు సైతం వచ్చాయి. పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణలో 2011 ఏప్రిల్‌లో బహిరంగ విచారణ నిర్వహించగా, మహారాష్ట్రలో చేపట్టలేకపోయారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న కారణంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి దాని స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించింది. ప్రస్తుతం ఈ మూడు బరాజ్‌లు విఫలమై కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారాయి. ఎల్ నినో ప్రభావంతో వచ్చే 2--7ఏళ్ల పాటు తీవ్ర వర్షాభావం నెలకొనే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేసింది. 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీతో నీళ్లను తరలించుకోవచ్చని, కనీసం 129.23 టీఎంసీల నీటి లభ్యత ఉండనుందని ప్రభుత్వం అంచనాకు వచి?చంది. ఆ మేరకు ఎత్తు పెంచినా మహారాష్ట్రలో పెద్దగా ముంపు పెరగదని భావిస్తోంది.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

## జనగణన శిక్షణ పూర్తి.. 11 నుంచి గృహ గణన

**- స్వీయ గణనకు 10 వరకు అవకాశం: కలెక్టర్ అనురాగ్ జయంతి??**



తొలివేలు, భువనగిరి: జిల్లాలో జనగణన కార్యక్రమానికి సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన నాలుగు దఫాల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ వివరాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,461 మంది ఎన్యుమరేటర్లు, 258 మంది సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది మే 11 నుంచి గృహ గణన (హౌస్ లిస్టింగ్) ప్రక్రియలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వివరించారు. ప్రజలు తమ వివరాలను మే 10వ తేదీలోపు 'స్వీయ గణన' ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇలా ముందుగా నమోదు చేసుకుంటే ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు పని సులభమవుతుందని తెలిపారు. ఈ జాతీయ యజ్ఞంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## ఘనంగా 'ఉప్పల' దంపతుల వెడ్డింగ్ యానివర్సరీ

**- శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య సంఘం నేతలు**

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త ఉప్పల సిద్ధిలింగం – నాగరాణి దంపతుల వివాహ దినోత్సవ వేడుకలు మంగళవారం రఘునాద ్పురంలో ఘనంగా జరిగాయి. రఘునాథపురం ఆర్యవైశ్య పట్టణ శాఖ అధ్యక్షులుగా, సామాజిక సేవా కార్యక్రమాల్లో దాతగా పేరుపొందిన సిద్ధిలింగం దంపతులను పలువురు ఆత్మీయులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయనకు సోషల్ మీడియా వేదికగా, అలాగే ఫోన్ల ద్వారా మిత్రులు, బంధువులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక వ్యాపారవేత్తలు ఈ వేడుకల్లో పాల్గొని దంపతులకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.



## మిత్రుడికి 'సోపతి' అండ.. రూ. 10 వేల ఆర్థిక సాయం



తొలివెలుగు, చౌటుప్పల్: ఆపదలో ఉన్న చిన్ననాటి మిత్రుడిని ఆదుకోవడానికి పాత విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990 – 91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల బృందం (పెద్దబడి సోపతిగాళ్లు) తమ తోటి మిత్రుడు రామరాజుకు అండగా నిలిచింది. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో రామరాజు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స అనంతరం ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. విషయం తెలుసుకున్న మిత్రబృందం స్పందించి, వారి సేవా నిధి నుంచి రూ. 10,000 నగదును రామరాజుకు అందజేశారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. చిన్ననాటి మిత్రులు ఇలాంటి కష్టసమయంలో తోడుగా నిలవడం పట్ల రామరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాచ్ ప్రతినిధులు, పలువురు మిత్రులు పాల్గొన్నారు.

## గర్దాస్ జనమ్మ పార్థివదేహానికి వేముల వీరేశం నివాళి



తొలివెలుగు, రామన్నపేట: మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యుడు గర్దాస్ వేణు తల్లి జనమ్మ (65) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం గ్రామానికి చేరుకుని ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పుస బాలకిషన్, పల్లివాడ మాజీ సర్పంచ్ గంగుల వెంకట రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగొని వెంకటేశం, వార్డు సభ్యులు సింగనబోయిన బాలరాజు, రాధారపు మహేష్, కంబాలపెల్లి సత్తయ్య, నల్ల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి సీపీఎం అండ..

**- రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత**



తొలివెలుగు, రామన్నపేట : పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్త కుటుంబానికి సీపీఎం గ్రామ శాఖ అండగా నిలిచి తన ఉదారతను చాటుకుంది. ఇటీవల అనారోగ్యంతో మరణించిన సీపీఎం గ్రామ నాయకుడు దోమలపల్లి నరసింహ కుటుంబ సభ్యులకు పార్టీ ఆధ్వర్యంలో రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం సిరిపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి చేతుల మీదుగా నరసింహ భార్య పేరిట చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నరసింహ ప్రజా సంఘాల ఉద్యమాల్లో చురుగ్గా ఉంటూ, నిరంతరం ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, నరసింహ మరణించిన రోజున అంత్యక్రియల ఖర్చులను కూడా గ్రామ శాఖే భరించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ మిరియాల భాస్కర్, నాయకులు కూనూరు వెంకటేశం, మోటే స్వామి, బైరెడ్డి మధుసూదన్ రెడ్డి, మార్త భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యమైన ఆహారం.. ఆరోగ్యానికి సోపానం





**- భువనగిరిలో వీధి వ్యాపారులు, మధ్యాహ్న భోజన కార్మికులకు 'సర్వ్ సేఫ్ ఫుడ్' శిక్షణ**

**- ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్**

**తొలివెలుగు, భువనగిరి:** ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా భువనగిరిలో 'సర్వ్ సేఫ్ ఫుడ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని వీధి వ్యాపారులు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే నిర్వాహకులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణా తరగతులను ప్రారంభించారు. నాస్వి , నెస్లే ఇండియా, భారత ఆహార భద్రతా, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతే కీలకం: ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ టి. శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆహార తయారీలో వ్యక్తిగత పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యాపారులు, నిర్వాహకులు శాస్త్రీయమైన నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడగలమని ఉద్ఘాటించారు.

నిబంధనలపై అధికారుల దిశానిర్దేశం: ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆహార భద్రతా నియమిత అధికారి పి. స్వాతి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనంద్ ఎన్. రావు, జిల్లా ఆహార భద్రతాధికారి (ఇన్‌చార్జ్) ఎన్. శివ శంకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరు ఆహార భద్రత చట్టాలు, నిబంధనలపై సమగ్రమైన అవగాహన కల్పించారు. ఆహార పదార్థాల నిల్వ విధానం, వంట గదుల పరిశుభ్రత, సురక్షితమైన పంపిణీ పద్ధతులపై వ్యాపారులకు సూచనలు చేశారు.

మూడు రోజుల పాటు శిక్షణ: మొత్తం మూడు రోజుల పాటు సాగే ఈ బృహత్తర కార్యక్రమంలో రోజుకు వంద మంది చొప్పున మొత్తం 300 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. మొదటి రోజు శిక్షణలో 100 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షకుడు రాజ్‌కుమార్.. చేతులు శుభ్రం చేసుకునే విధానం, తలపాగా (హెడ్గేర్‌లు), ఆప్రాన్ల వాడకం గురించి వివరించారు. శిక్షణలో పాల్గొన్న వారికి పర్సనల్ హైజీన్ కిట్లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. చంద్రప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, నెస్లే ఇండియా సీనియర్ మేనేజర్ వసీం అహ్మద్, నాస్వి ప్రతినిధి రౌషన్ కుమార్, శిక్షకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ భక్తులకు 'భిక్ష'





**- సాయి మందిరంలో ప్రత్యేక పూజలు..**

**- అన్నప్రసాద వితరణ చేసిన సంధిల భాస్కర్ గౌడ్**

తొలివెలుగు, రాజాపేట: మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం హనుమాన్ మాలాధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ (భిక్ష) కార్యక్రమం వైభవంగా జరిగింది. మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ – వాణి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా ఆలయంలోని ప్రతిష్ఠామూర్తికి చందన సమర్పణ, ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలను భాస్కర్ గౌడ్ దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్వామివారి కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మహానైవేద్యం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పలువురు రాజకీయ ప్రముఖులను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజాపేట సర్పంచి కోయ మధు, రఘునాథపురం సర్పంచి పల్లె సంతోష్ గౌడ్, సింగారం సర్పంచ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, టీఆర్ఎస్ నాయకులు, నది జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, చెల్మిడి వెంకటేష్, రేగు సిద్ధులు, జర్నలిస్టు ఠాగూర్ హిమ్మత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగులో రావాలి.. విప్లవాత్మక మార్పులు!

**- వరి నుంచి ఆయిల్ పామ్ వైపు మళ్లాలి: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి - రూపాయి పెట్టుబడికి రూ.3ల ఆదాయం: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



తొలివెలుగు, భువనగిరి: జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, రైతులు అధిక ఆదాయం ఇచ్చే పంటలపై దృష్టి సారించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన భువనగిరి నియోజకవర్గ స్థాయి ఉద్యాన రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పంటల మార్పిడిలో భాగంగా రైతులు వరి సాగును తగ్గించి ఆయిల్ పామ్, ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రైతులకు నమ్మకాన్ని కలిగించి, ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న వారిలో నుంచే నాయకులను తయారు చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు ద్వారా వంట నూనెల దిగుమతులు తగ్గి, దేశానికి విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందన్నారు. ఉద్యాన పంటల ద్వారా ఒక రూపాయి పెట్టుబడి పెడితే మూడు రూపాయల ఆదాయం వస్తుందని వివరించారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు కేవలం 7 శాతమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీకి వీటి ఉత్పత్తుల ద్వారా 25 శాతం వాటా అందుతోందని గణాంకాలతో వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర రావు, జిల్లా ఉద్యాన అధికారిణి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## సంతలో 'చల్లని' సేవ.. ఐదో వారమూ మజ్జిగ పంపిణీ

**- ప్రజల దాహార్తి తీరుస్తున్న పి.సి.ఆర్ ఫౌండేషన్**



తొలివెలుగు, జన్నారం: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పూర్ణచంద్రరావు (పీసీఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. జన్నారం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారసంతకు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, చిరువ్యాపారులు, సామాన్య ప్రజలు వస్తుంటారు. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, వారికి ఉపశమనం కలిగించేందుకు ఫౌండేషన్ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ఐదు వారాలుగా ఈ సేవలు నిరంతరాయంగా కొనసాగుతుండటం పట్ల స్థానికుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ఎండల తీవ్రత దృష్ట్యా సంతకు వచ్చే ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండాలనే సదుద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, రాబోయే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఉత్తూరి శ్రీనివాస్, జన్నారం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, ఫౌండేషన్ ప్రతినిధులు నిముషకవి రాజేష్, సకినాల భూమేష్, సత్యం తదితరులు క్రియాశీలకంగా పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలి..
### - కమిషనర్‌కు శేఖర్ గౌడ్ వినతి

**తొలివెలుగు, చౌటుప్పల్:** పట్టణంలోని తంగడపల్లి రోడ్డు సమీపంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని వెంటనే శుభ్రం చేయించి, చిరు వ్యాపారులకు కేటాయించాలని మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణ పనుల కారణంగా చిరు వ్యాపారులు రోడ్లపై వ్యాపారం చేయలేక దుమ్ము, కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ భవనంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. అదేవిధంగా, ఫారెస్ట్ గేటు ముందు నుంచి గ్రంథాలయం, మున్సిపల్ కార్యాలయం వెనక భాగం మీదుగా తాత్కాలిక రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. దీనివల్ల మార్కెట్‌కు వచ్చే ప్రజలకు రవాణా సులభతరం కావడమే కాకుండా, హైవేపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వివరించారు. ప్రజల, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన విన్నవించారు.

## మొదటి జీతం.. చదువులమ్మ ఒడికి బహుమతం!
### - కానిస్టేబుల్ రాజకుమార్ గొప్ప మనసు.. టాపర్లకు నగదు ప్రోత్సాహం



తొలివెలుగు, రామన్నపేట: కష్టపడి సాధించిన తొలి వేతనాన్ని సామాజిక ప్రయోజనం కోసం వెచ్చించి ఓ కానిస్టేబుల్ తన ఉదారతను చాటుకున్నారు. కొమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కానిస్టేబుల్ ఎర్ర రాజకుమార్ (తండ్రి మహాలింగం) మంగళవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. తన మొదటి జీతం నుంచి ఏదైనా మంచి కార్యక్రమం చేయాలనే సంకల్పంతో.. ప్రథమ స్థానంలో నిలిచిన బాతుక మల్లేశం, ద్వితీయ స్థానం సాధించిన ఎర్ర జ్యోతి బస్‌లకు నగదు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. మురళీధర్ మాట్లాడుతూ.. సమాజం పట్ల బాధ్యతగా రాజకుమార్ తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల్లో మరింత పోటీ తత్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సఫియా బేగం, కోట విజయ, వెంకన్న, ఏఐపిసి చైర్మన్ చీమలపాటి కృష్ణవేణి, వార్డు సభ్యులు అంబాల అశోక్, సురేఖ, ఐలాపురం రమేష్, తల్లిదండ్రులు ఎర్ర కాటమయ్య, బాతుక మారయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అండగా నిలిచిన రాజకుమార్‌ను పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు.. క్యాటరింగ్ యజమాని మృతి
### - తూప్రాన్‌పేట కొత్త బ్రిడ్జి వద్ద ప్రమాదం





**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన క్యాటరింగ్ యజమాని రుద్రరాజు వీర వెంకటరామరాజు (40) దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లికి చెందిన రామరాజు హైదరాబాద్‌లోని కృష్ణానగర్‌లో నివసిస్తూ సినిమా షూటింగ్‌లకు క్యాటరింగ్ నిర్వహిస్తుంటారు. తన బృంద సభ్యులు నాయుడు, రామకృష్ణ, రమేష్ కుమార్, శ్రీనివాసరాజులతో కలిసి టయోటా క్వాలిస్ వాహనంలో హైదరాబాద్ నుంచి మల్కాపురం వస్తుండగా, ఉదయం 6:10 గంటల సమయంలో తూప్రాన్‌పేట కొత్త బ్రిడ్జి వద్ద నిర్మాణంలో ఉన్న డివైడర్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీటులో కూర్చున్న రామరాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకోగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మనోజ్ఞ ఆస్పత్రికి తరలించగా, రామరాజు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని తమ్ముడు గుంటూరు సాయి రవి వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**తొలివెలుగు, ఆత్మకూరు ఎం:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, ఆలేరు మున్సిపాలిటీల్లో, ఎనిమిది మంది కో ఆప్షన్స్ సభ్యుల ఎన్నిక ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన యాదగిరిగుట్ట పట్టణంలో గౌలికార్ అరుణ, సయ్యద్ రహిమ, బండి జంగమ్మ,షరీఫ్, ఎం ఎస్ విజయ్ కుమార్, చింతకింది మురళి, గుత్తా శమంతారెడ్డి, సిపిఎం కు చెందిన ఇంతియాజ్ ఇర్ఫానా కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# హమాలీల కొరతతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

### - రాజకీయ లబ్ధి కోసమే విపక్షాల రాస్తారోకోలు: మల్లారెడ్డి, బిక్షంరెడ్డి



తొలివెలుగు, రామన్నపేట: మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి ప్రధాన కారణం హమాలీల కొరతేనని, దీనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని వలిగొండ - రామన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే స్పష్టమైన హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. సహకార సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. గత సీజన్లతో పోలిస్తే ఈ రబీ సీజన్లో 30 శాతం వరి దిగుబడి అదనంగా వచ్చిందని వారు తెలిపారు. అయితే, అక్కడక్కడ తెగుళ్ల ప్రభావం వల్ల ధాన్యంలో తాలు శాతం పెరిగిందని, దీనివల్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం బియ్యం పట్టలేమని మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంతో కొంత ఇబ్బంది తలెత్తుతున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కొనుగోళ్లలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రతిరోజూ ఆర్డీఓ, తహసీల్దార్ తదితర జిల్లా అధికారులతో చర్చిస్తూ పరిస్థితులను చక్కదిద్దుతున్నారని పేర్కొన్నారు. అంతా సద్దుమణిగి కొనుగోళ్లు సజావుగా సాగుతున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కేవలం రాజకీయ లబ్ధి కోసమే తమ కార్యకర్తలతో రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2022లో 'వరి వేస్తే ఉరే' అని చెప్పిన విషయాన్ని, అలాగే నాడు 42 కేజీల తూకం వేసి రైతులను మోసం చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో బస్తాకు 45 కేజీల తూకం వేస్తున్నట్లు ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. 45 కేజీల తూకం వేస్తున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని మాజీ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా డీసీసీ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటి రమేష్, ఎం.డి. జమీరుద్దీన్ పాల్గొన్నారు.

# రైతును దోచుకుంటే సహించేది లేదు

### - తాలు, తరుగు పేరుతో కోతలు విధిస్తే ఆందోళన తప్పదు
### - సిరిపురం కొనుగోలు కేంద్రంలో రైతు సంఘం నేత అశోక్ రెడ్డి



**తొలివెలుగు, రామన్నపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిరిపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా సేకరించకపోవడం శోచనీయమన్నారు. అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తాలు, తరుగు పేరుతో క్వింటాకు కిలోల కొద్దీ కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు నెలల కష్టానికి కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలని కోరారు. ధాన్యం కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, కూనూరు వెంకటేశం, దాడి మల్లారెడ్డి, అంబటి సురేందర్ రెడ్డి, బైరెడ్డి మల్లారెడ్డి, కట్ట లక్ష్మారెడ్డి, కట్ట భాస్కర్ రెడ్డి, కట్ట నరసింహారెడ్డి, కనుకుంట్ల జన్నారెడ్డి, కంకల సైదులు, మోటి రమేష్, కూనూరు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మే18,19 తేదీల్లో రామన్నపేటలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి పిలుపు



**తొలివెలుగు, ఆత్మకూరు ఎం:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మే 18, 19 తేదీలలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు ఎం మండల పరిధిలోని కూరెళ్ళ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు ఎం మండల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాదగిరి పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక కూలీ, భూమి, ఉపాధి, సంక్షేమం, విద్య, వైద్యం, కూలీ పేటలో అభివృద్ధిపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం నిలిచిందని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ భూమిలేని ప్రతి పేదవాడికి ప్రభుత్వ భూములు పంచాలని కోరుతూ అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాల భూములను దేశవ్యాప్తంగా పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉన్నదని అన్నారు. నేడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడంలో కూడా ఆనాడు కీలకపాత్ర పోషించిందని తెలిపారు. నేడు మోడీ బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న ఉపాధి హామీని రద్దు చేయడానికి అనేక కుట్రలు చేస్తుందని ఆ కుట్రలను నిరంతరం కూలీలను సమీకరించి తిప్పి కొడుతుందని తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకొని రానున్న కాలంలో వ్యవసాయ కార్మికుల, పేదల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం ఉద్యమాలు రూపొందించడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభల సందర్భంగా 18 వ తేదీన సాయంత్రం 5 గంటలకు వందలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెకట్రాములు, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నరసింహ ప్రసంగిస్తారని తెలిపారు. 18న నిర్వహించే బహిరంగ సభలో ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని, 19 నిర్వహించే ప్రతినిధుల మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం అన్ని మండలాలకు సంబంధించిన నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ,జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, వృత్తి సంఘాల జిల్లా నాయకులు వేముల బిక్షం, రచ్చ గోవర్ధన్, భాషబోయిన రాములు, తుమ్మల సత్యనారాయణరెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మరిపెల్లి మల్లయ్య, మల్లెల శ్రీశైలం, ఉపసర్పంచ్ హనుమంతుల రమేష్, బండ బీరయ్య, తుమ్మలగూడెం యాదయ్య, కూరెళ్ళ నాగయ్య, రేసు యాదిరెడ్డి,పొన్నగాని బిక్షపతి,వడ్లకొండ సోమక్క, తుమ్మలగూడెం గీత, కన్నెబోయిన అంజయ్య, భాషబోయిన బుగ్గయ్య, నార్కట్పల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.20వేలు లంచం తీసుకుంటూ...
## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



**తొలివెలుగు, కల్వకుర్తి (తలకొండపల్లి)** ఇంటి స్థలానికి సంబంధించి రికార్డులలో పేరు మార్పిడి విషయంలో బాధితుడి నుండి రూ. 20 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన సంఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో చోటుచేసుకుంది.. ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కి చెందిన వ్యక్తి ఇంటి రిజిస్ట్రేషన్ కి సంబంధించిన డాక్యుమెంట్ పేపర్స్ ను గ్రామపంచాయతీ రికార్డులలో పేరు మార్పిడి చేయడానికి పంచాయితీ కార్యదర్శి శరత్ ను సంప్రదించగా గత కొద్ది నెలల నుంచి పంచాయతీ కార్యదర్శి శరత్ పలు ఇబ్బందులకు గురి చేస్తూ.. రూ.30వేలు లంచం డిమాండ్ చేశాడు. ఒప్పందం ప్రకారం బాధితుల నుంచి డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పంచాయితీ కార్యదర్శిని విచారణ చేసి కోర్ట్ లో హాజరు పరుస్తామని డి.ఎస్.పి తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## తాలు పేరిట తరుగు తీయకూడదు



**తొలివెలుగు, నూతనకల్** నూతనకల్ మండలం చిల్పకుంట్లలోని ఐకెపి సెంటర్ ను రైతు సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టం చేసిన రైతన్న ను ఇబ్బందులకు గురి చేయొద్దని ఐకెపి సెంటర్ నిర్వాహకులను కోరారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కోరారు. లారీలను సమయానికి పంపించాలని అధికారులను కోరారు. తాలు పేరుతో క్వింటాకు రెండు నుంచి మూడు కిలోల చొప్పున మిల్లర్లు తరుగు తీస్తున్నారని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ సామ సురేందర్ రెడ్డి రైతు సంఘం మండల కార్యదర్శి గజ్జల శ్రీనివాస్ రెడ్డి రైతులు బద్దం ఇంద్రసేనారెడ్డి తొట్ల మహేష్ సింగిరెడ్డి ఉప్పల్ రెడ్డి కొత్తపల్లి రాంరెడ్డి పులుసు లింగ మల్లయ్య జటంగి మహేష్ మందడి చంద్రారెడ్డి కూసు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## 'పోలీస్ కంప్లైంట్' నుంచి సాంగ్

నవీన్ చంద్ర, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి రూపొందిస్తున్న ఈ చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.
సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటను తెలుగు సినీ దిగ్గజం సూపర్ స్టార్ కృష్ణకు అంకితం చేయడం విశేషం. ఈ సాంగ్ విడుదలతో సినిమా మీద మరింత హైప్ పెరిగింది. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని తెలిపారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రధానంగా తీసుకుని పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. అలాగే హారర్ అంశాలు కూడా ఉండటం వల్ల ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతి కలిగిస్తుందని పేర్కొన్నారు.
ఈ చిత్రానికి ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి, సుధాకర్ మారియో సంగీతం అందిస్తుండగా, బాలకృష్ణ మహారాణా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ 'పోలీస్ కంప్లైంట్'పై సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

## పెళ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన కలర్స్ స్వాతి..

ప్రముఖ నటి కలర్స్ స్వాతి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న అమె, గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంది. అయితే తాజాగా ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పెళ్లి ప్రపోజల్స్ గురించి మాట్లాడిన స్వాతి, చాలా మంది అబ్బాయిలు అమ్మాయిలను ఆకట్టుకోవడానికి 'పెళ్లి చేసుకుంటాను' అనే మాటను ఉపయోగిస్తారని తెలిపారు. తాను హోమ్లీ గర్ల్‌గా కనిపించడం వల్ల ఇలాంటి ప్రపోజల్స్ ఎక్కువగా వచ్చాయని, కానీ వారి మాటల్లో నిజాయితీ లేకపోవడం గుర్తించి 'నో థాంక్స్' చెప్పేదాన్నని వెల్లడించారు.
ఇక వివాహ బంధాల గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, బయటికి ప్రేమగా కనిపించే చాలా జంటల్లో లోపల సమస్యలు ఉంటాయని అన్నారు. చేతులు పట్టుకుని తిరుగుతూనే, వ్యక్తిగతంగా వేరే మెసేజ్‌లు పంపుకుంటూ ఉండే హిపోక్రసీని తాను చూసినట్లు చెప్పారు. ఈ అనుభవాల కారణంగానే ఒక దశలో పెళ్లిపై విరక్తి కలిగిందని తెలిపారు.అంతేకాకుండా, అప్పట్లో పెళ్లి చేసుకోవడం కంటే ఒక కుక్కను పెంచుకుని, తల్లిదండ్రులను చూసుకోవాలని నిర్ణయించుకున్నట్లు స్వాతి చెప్పారు. అయితే, తన తల్లిదండ్రులు రివర్స్ సైకాలజీ ఉపయోగించి "నువ్వు సంతోషంగా ఉండకూడదా?" అని అడగడంతో చివరకు పెళ్లి విషయంపై ఓపెన్ అయ్యానని తెలిపారు. ప్రేమ వివాహాలపై తనకు పెద్దగా నమ్మకం లేదని, ఏదైనా తప్పు జరిగితే తానే బాధపడాల్సి వస్తుందని ఆమె అన్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే, ఏదైనా సమస్య వచ్చినా వారినే ప్రశ్నించొచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. మంచి జీవిత భాగస్వామి దొరకడం అదృష్టమని, అబద్ధాలు చెప్పే వాళ్లు, సైకోలా ప్రవర్తించే వాళ్లు చాలా మందిని తాను చూసినట్లు చెప్పారు. మొత్తానికి, కలర్స్ స్వాతి చేసిన ఈ నిజాయితీ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిప్రాయాలకు కొందరు మద్దతు ఇస్తుండగా, మరికొందరు భిన్నంగా స్పందిస్తున్నారు.





## 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్‌పై కియారా అభ్యంతరం..

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్ దాస్ రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ అంశం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సమాచారం ప్రకారం, ఈ సినిమా ఫైనల్ కట్ చూసిన హీరోయిన్ కియారా అద్వానీ కొన్ని సీన్లపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కథా అవసరాల మేరకు చిత్రీకరించిన కొన్ని బోల్డ్, ఇంటిమేట్ సన్నివేశాలు వెండితెరపై మరీ ఎక్కువగా ఉన్నాయని ఆమె భావిస్తున్నారట. ప్రస్తుతం కియారా పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో, తన ఇమేజ్‌పై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా పెళ్లి తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్‌లో తనకు ఉన్న క్రేజ్ దెబ్బతినకుండా ఉండాలని భావిస్తూ, ఆ సీన్లను పూర్తిగా తొలగించాలన్నా లేదా కనీసం వాటి నిడివిని తగ్గించాలన్నా దర్శకురాలిని కోరినట్లు సమాచారం.
అయితే దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాత్రం ఆ సన్నివేశాలు కథలో కీలకమని, వాటిని తీసేస్తే సినిమా ప్రభావం తగ్గిపోతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ విషయంలో చిత్రబృందంలో చర్చలు కొనసాగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి 'టాక్సిక్' విడుదలకు ముందే ఈ వివాదం ఆసక్తిని మరింత పెంచుతోంది. కియారా అభ్యర్థనను చిత్రబృందం పరిగణలోకి తీసుకుంటుందా? లేక కథకు ప్రాధాన్యం ఇస్తుందా? అనేది సినిమా విడుదల వరకు సస్పెన్స్‌గా మారింది.

## 'పతి పత్ని ఔర్ వో దో' ట్రైలర్ విడుదల..

బాలీవుడ్ విలక్షణ నటుడు ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రలో నటిస్తున్న కామెడీ డ్రామా 'పతి పత్ని ఔర్ వో దో' ట్రైలర్ విడుదలైంది. ఈ చిత్రం మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. 2019లో వచ్చిన సూపర్ హిట్ 'పతి పత్ని ఔర్ వో'కి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. ఈ సినిమాకు దర్శకుడు ముదస్సర్ అజీజ్. ట్రైలర్‌ను గమనిస్తే.. ఈ సినిమాలో ఆయుష్మాన్ 'ప్రజాపతి పాండే' అనే ఫారెస్ట్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఒక స్నేహితురాలికి సహాయం చేయాలనుకుని, తన జీవితాన్నే గందరగోళంలోకి నెట్టుకుంటాడు. ఈసారి కథ మరింత హాస్యభరితంగా, చిక్కుముడులతో నిండినట్టుగా కనిపిస్తోంది. ఈ సినిమాలో ఒక్కరు కాదు, ఏకంగా ముగ్గురు హీరోయిన్లతో ప్రజాపతి పాండే ఇబ్బందులు పడటం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి తమ గ్లామర్, నటనతో అలరించబోతున్నారు. ఇక సినిమాలో విజయ్ రాజ్, తిగ్మాన్షు ధులియా, అయేషా రజా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మొత్తానికి, ట్రైలర్ చూస్తుంటే హాస్యం, రొమాన్స్, గందరగోళ పరిస్థితులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా కనిపిస్తోంది. మొదటి భాగం సక్సెస్‌ను దృష్టిలో పెట్టుకుని తెరకెక్కిన ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద ఎలా రాణిస్తుందో చూడాలి.